క్లుప్తంగా

వైఎస్సార్ బీమా పేదలకు అండ



నగదు అందజేస్తున్న సర్పంచ్ వెంకట్రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: మండలంలోని తమ్మడపల్లె గ్రామానికి చెందిన ఖాసీం(32) ఈనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు గురువారం బాధిత కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలను వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. వైఎస్సార్ బీమా బేదలకు అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామానికి చెందిన తాటి రామ సుబ్బయ్యపై మట్టి గొడ కూలి పడడంతో మృతి చెందాడు. ఈ మేరకు గురువారం మృతిని భార్య తాటి ఆదిలక్ష్మికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10వేలను సచివాలయ వల్ఫేర్ అసిస్టెంట్ బాల నరసింహుడు, వలంటీర్ వెంకట సుబ్బయ్య తదితరులు అందజేశారు.

సన్మానం



శ్రీనివాసులును సన్మానిస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న శ్రీనివాసులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఇటీవల అవార్డు అందుకున్నారు. ఈ మేరకు గురువారం హెచ్ఎం శ్రీధర్ ఆధ్వర్యంలో శ్రీనివాసులును ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. పూలమాలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయస్వాములు, చంద్రమోహన్, రాజ కుళ్లాయప్ప, సరోజమ్మ, శ్రీలత, కృష్ణవేణమ్మ, నాగరాజు, శ్యామల, చాముండేశ్వరి, అబ్దుల్ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

అంకిరెడ్డిపల్లె మీసేవా కేంద్రంలో చోరీ

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె ప్రధాన రహదారిలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ కింద భాగంలో ఉన్న మీ–సేవా కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రెండు ల్యాబ్ ట్యాబ్‌లు, మూడు ప్రింటర్లను దొంగలు అపహరించారు. కొలిమిగుండ్లకు చెందిన మధుప్రసాద్‌రెడ్డి అంకిరెడ్డిపల్లెలో మీసేవా నిర్వహిస్తున్నాడు. బుధవారం కృష్ణాష్టమి పండుగ సెలవు కావడంతో ఆయన మీసేవా కేంద్రానికి వెళ్లలేదు. గురువారం వెళ్లి చూడగా ప్రధాన ద్వారం బీగాలు పగిలి ఉన్నాయి. ల్యాబ్‌ట్యాబ్‌లు, ప్రింటర్లు కనిపించలేదు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసు లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : మున్సిపల్ కార్మికుల సంక్షేమమే తమ ధ్యేయమని చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక కార్యాలయం ఆవరణలో గురువారం కార్మికులకు దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్‌హుసేన్ చేతుల మీదుగా ఒక్కో కార్మికునికి ఆరు జతలయూనిఫారంతో పాటు ఆరు టవళ్లు, మహిళ కార్మికులకు ఆరు చీరలు, ఆరు టవళ్ల చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు దానం, సుధాకర్, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భారీగా పడిపోయిన టమాటా ధర

ప్యాపిలి: స్థానిక టమాటా మార్కెట్‌లో గురువారం టమాటా ధర ఒక్కసారిగా పడిపోయింది. దీంతో సుదూర ప్రాంతాల నుంచి టమాటా తీసుకొచ్చిన రైతులు తీవ్ర నిరాశతో మార్కెట్‌లోనే వాటిని వదిలేసి వెళ్లారు. కొద్ది నెలల క్రితం కిలో రూ.200 పలికిన ధర ఒక్కసారిగా అథఃపాతాళానికి పడిపోయింది. గురువారం కిలో రూ.1 పలకడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. 25 కిలోల బాక్స్‌ను రూ.25కి అడిగితే ఎలా అని పలువురు రైతులు.. వ్యాపారులను ప్రశ్నించారు. కనీసం రవాణా ఖర్చులు కూడా రాకపోవడంతో కొందరు రైతులు టమాటాలను మార్కెట్‌లోనే వదిలి వెళ్లారు. కొందరు రైతులు టమాటాలను పశువులకు మేతగా వేశారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

డోన్‌టౌన్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఆర్‌డీఓ వెంకటరెడ్డికి బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దామోదర్ నాయుడు, మద్దిలేటి, బాలక్రిష్ణ, రాఘవేంద్ర ఆచారి, వెంకటేశ్వర్లు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతంగా విద్యాబోధన!





స్టడీ అవర్‌లో పాల్గొన్న కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు (ఫైల్), మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో చదువుకుంటున్న విద్యార్థినులు(ఫైల్)

- పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించిన ఉపాధ్యాయులు
- విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే స్టడీ అవర్స్
- వెనుక బడిన విద్యార్థుల సామర్థ్యం పెంపే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు

కొలిమిగుండ్ల: పదో తరగతి ఫలితాలపై విద్యాశాఖ దృష్టి సారించింది. విద్యాబోధన ఉన్నతంగా అందేలా చర్యలు చేపట్టింది. విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచి పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే స్టడీ అవర్స్ ఏర్పాటు చేశారు. ముందస్తుగా పది పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు ఉపాధ్యాయులు. ప్రణాళిక ప్రకారం సిలబస్ పూర్తి చేసి స్లిప్ టెస్ట్‌లు పెట్టి విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తున్నారు. గతేడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు నిరాశపర్చడంతో విద్యాశాఖ ఈఏడాది ముందుగానే ప్రణాళికతో ముందుకు పోతుంది. ఆ దిశగా ఉపాధ్యాయులు వెనుకపడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో 48 ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూళ్లు 3, కస్తూర్బా పాఠశాలలు 4 ఉన్నాయి. 2023–24 విద్యా సంవత్సరంలో 3882 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాబోతున్నారు.

ముందస్తు చర్యలు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేసేందుకు విద్యాశాఖ కార్యాచరణ ప్రారంభిచింది. పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటి నుంచే ఉపాధ్యాయులు ప్రతి రోజు విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. రోజు ఉదయం, సాయంత్రం ఒక సబ్జెక్ట్ చొప్పున విద్యార్థులతో చదివిస్తున్నారు. ఆ సబ్జెక్ట్ ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు వచ్చే సందేహాలను నివృత్తి చేస్తు వారికి సూచనలు అందిస్తున్నారు. ప్రతి రోజు స్టడీ అవర్ ప్రారంభం కాగానే యాప్‌లో ఫొటో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆయా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్‌ల వారీగా షెడ్యూల్ వేసుకొని విద్యార్థులు తప్పక హాజరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏరోజు జరిగిన పాఠాలు అదే రోజు విద్యార్థులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈఏడాది ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రతి పాఠశాల హెడ్మాస్టర్‌తో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రణాళిక తయారు చేశారు.

నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల, విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలల సంఖ్య	విద్యార్థులు
కొలిమిగుండ్ల	12	525
సంజామల	08	378
కోవెలకుంట్ల	08	674
అవుకు	12	732
బనగానపల్లె	14	1573

ప్రత్యేక శద్ధ తీసుకుంటున్నాం



పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి 10 వరకు, సాయంత్రం 4గంటల నుంచి 4:45 వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయులకు సబ్జెక్ట్‌ల వారీగా షెడ్యూల్ వేశాం. విద్యార్థులు తప్పక హాజరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. గైర్హాజరు అయితే తల్లితండ్రులకు సమాచారం చేరవేస్తున్నాం. –బాలసుబ్బారెడ్డి, హెచ్ఎం, కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల

మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యం



పదో తరగతిలో గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాం. ప్రతి పాఠశాలలో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులతో సమీక్షలు జరిపి బోధనా పద్ధతులు వివరిస్తున్నాం. అదేవిధంగా విద్యార్థుపై తీసుకోవాల్సిన శ్రద్ధపై సూచనలు ఇస్తున్నాం. విద్యార్థులు సైతం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మెరుగైన ఫలితాలు సాధిస్తామనే నమ్మకం ఉంది.
– అబ్దుల్ కలాం,ఎంఈఓ.

నేటి నుంచి మద్దిలేటి స్వామికి ఆర్డీసీ బస్సులు

డోన్ టౌన్ : బేతంచర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం సమీపంలో వెలసిన మద్దిలేటి స్వామి దేవస్థానానికి శుక్ర, శనివారాలు ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషన్ తెలిపారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు భక్తుల సౌకర్యార్థం మద్దిలేయ్యస్వామికి రెండురోజుల పాటు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తుల రద్దీ మేరకు బస్సు సర్వీసులు పెంచుతామని, ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మండల స్థాయిలో ‘జగనన్నకు చెబుదాం’

నంద్యాల: ప్రజా ఫిర్యాదులకు మెరుగైన పరిష్కారం కోసం మండల స్థాయిలో ఈనెల 8న గోస్పాడులో జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇకపై ప్రతి బుధవారం, శుక్రవారాల్లో మండల కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 8వ తేదీ గోస్పాడు, 13న శిరివెళ్ల, 15న బండిఆత్మకూరు, 20న నంద్యాల, 22న బేతంచర్ల, 27న బనగానపల్లె, 29వ తేదీ పాణ్యం మండలాల్లో స్పందన ఉంటుందని కలెక్టర్ వివరించారు. ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని సంబంధిత డీఎల్‌డీఓల సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్ : ఓటర్ల జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రాజకీయపార్టీలు సహకరించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పులు, మరణించిన వారి ఓట్ల తొలగింపు, నూతన ఓట్లలో చేర్పుల అంశాలను వివరించారు. ఓటర్ల జాబితాలో సవరణలపై ఏవైనా అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, సీపీఎం, సీపీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండండి

ప్యాపిలి: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీని సాగనంపడానికి ప్రజలు సిద్ధం కావాలని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటి కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లా గుత్తి నుంచి బనగానపల్లెకు వెళ్తూ మార్గమధ్యంలో గురువారం రాత్రి ఆయన ప్యాపిలిలో కాసేపు ఆగారు. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిందన్నారు. ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో డోన్ నియోజకవర్గానికి ఒక్క ఉద్యోగమైనా వచ్చిందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇసుక ధర, కరెంట్ చార్జీలు, పెట్రోల్ డీజిల్ ధరలు, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇంట్లో పిల్లలు ఎంత మంది ఉంటే అంత మందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. రైతు భరోసా కింద రూ.20 వేలు, ఆడబిడ్డ నిధి కింద ఆడపిల్లలకు రూ.15 వేలు ఇస్తామన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన ఘనత తనదేనని, అమరావతిని కూడా అభివృద్ధి చేశానన్నారు.

బాలికల విద్యాభివృద్ధికి సహకారం



విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : బాలికల విద్యాభివృద్ధికి కెనరా బ్యాంక్ సంపూర్ణ సహకారం అందజేస్తుందని, వారికి ఎలాంటి పూచీ లేకుండా రూ. 7,50,000 వరకు రుణాలు అందజేస్తుందని ఆ బ్యాంక్ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ నవీన్ కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో నవీన్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం విద్యాజ్యోతి పథకం క్రింద విద్యార్థులకు నగదు ప్రోత్సకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 5 నుంచి 7వ తరగతి, 8 నుంచి 10వ తరగతి వరకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు రూ. 2,500, రూ.5వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతుల చెక్కులను ఎంఈఓ ప్రభాకర్‌తో కలిసి నవీన్ కుమార్ అందజేశారు. బాలికల విద్యాభివృద్ధి, మహిళల ఆర్థికాభివృద్ధికి కెనరా బ్యాంక్ ఎన్నో పథకాలు అమలు చేస్తుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మహిమున్నీసా, బ్యాంక్ సిబ్బంది నరేష్ పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి



ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ అబ్దుల్‌షఫీ

డోన్ రూరల్ : సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాని ఏఓ అబ్దుల్ షఫీ సూచించారు. మండల పరిధిలోని యాపదిన్నె, ఉంగరానిగుండ్ల గ్రామాల లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని గురువారం ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు తమ పొలాల వద్దనే ఉండి పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకోని రైతులకు నష్ట పరిహారం తదితర పథకాలు వర్తించవన్నారు. కార్యక్రమంలో గ్రామ సహాయకులు నరసింహ, జీవిత, ఇషాక్ పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఏఓ సుబ్బారెడ్డి సూచించారు. మండంలోని యనకండ్ల, తమ్మడపల్లి గ్రామంల్లోని ఆర్‌బీకేలను గురువారం ఏఓ సందర్శించారు. ఎరువుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఈ క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ క్రాప్ ప్రయోజనాలను రైతులకు వివరించి చైతన్యపరచాలని ఏఓ ఆర్బీకే సిబ్బందికి సూచించారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పౌష్టికాహారం తయారీపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త లక్ష్మీప్రియ

బనగానపల్లెరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహరాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త లక్ష్మీప్రియ సూచించారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని భానుముక్కల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవ కార్యక్రమం ఏసీడీపీఓ రోజా రాణి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి హాజరైన శాస్త్రవేత్త లక్ష్మీప్రియ గర్భిణులు, బాలింతలను ఉద్దేశించి మాట్లాడారు. తల్లీబిడ్డ సంక్షేమానికి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పాలు, రాగి పిండి,చిక్కీలు,ఖర్జూర, గుడ్లు తదితర 11 రకాలను జగనన్న సంపూర్ణపోషణ కిట్లను అందజేస్తుందని చెప్పారు. గర్భిణులు ప్రసవాలను ప్రభుత్వ వైద్యశాలల్లోనే చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తక్కువ ధరల్లో లభించే ఆకుకూరలు, కూరగాయలు, క్యారెట్, బీరకాయ తదితర వాటితో పౌష్టికాహారం తయారీపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాలమ్మ, చిట్టెమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతను పాటించాలి

బనగానపల్లెరూరల్: విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రతను పాటించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామంలోని బీసీ సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాన్ని గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూత్రాలు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జ్వరం, దగ్గు,ఒళ్లు నొప్పులు తదితర లక్షణాలు కనబడితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నల్లగట్ల వెంకటేశ్వర్లు, వార్డన్ మునిరాజు తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



అంకిరెడ్డిపల్లె గీతాశ్రమంలో స్వామివారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



శ్రీకృష్ణమందిరంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బనగానపల్లెలో రవ్వలకొండ సమీపంలో శ్రీకృష్ణుడుకి పూజలు నిర్వహిస్తున్న యాదవ సంఘం నాయకులు



శ్రీకృష్ణుని విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న యాదవ సోదరులు



శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న భక్తులు

బనగానపల్లెరూరల్ : మండల కేంద్రం బనగానపల్లెతోపాటు గ్రామాల్లో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్టికొట్టు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. పలుకూరులోని శ్రీ కృష్ణ మందిరంలోని స్వామివారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండ సమీపంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణామి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలోని గీతాశ్రమంతోపాటు కొలిమిగుండ్ల లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అంకిరెడ్డిపల్లె గీతాశ్రమంలోని శ్రీకృష్ణుని ఆలయంలో తెల్లవారు జామునే స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. గీతాపారాయణం, భజన గీతాలు ఆలపించారు. కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, పారిశ్రామికవేత్త పేరం బయపురెడ్డి, యాదవ సంఘం నాయకులు జయదేవుడు, పుల్లయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా ముగిశాయి. రాముల దేవాలయం సమీపంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ముగింపు వేడుకల్లో భాగంగా గ్రామ పురవీధుల మీదుగా కృష్ణుని విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు.

అంభరాన్నంటిన కృష్ణాష్టమి వేడుకలు

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన బృందావనంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. ప్రత్యేక పూజల అనంతరం భక్తజన సందోహం మధ్య సాగిన ఉట్టికొట్టు కార్యక్రమం ఆకట్టుకుంది. చిన్నారులు శ్రీ కృష్ణ, గోపికల వేశాధారణ పోటీలు అలరించాయి. చిన్నారులకు ప్రథమ, ద్వితీయంతోపాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకట్, పద్మనాభం, శ్రీనువాసులు, వీరారెడ్డి, గూని నాగరాజు, మద్దిలేటి పాల్గొన్నారు.

ఐచర్ డ్రైవర్‌కు గాయాలు

డోన్ రూరల్ : పట్టణం సమీపంలోని 44వ జాతీయ రహదారిపై గురువారం లారీని ఐచర్ ఢీ కొన్న ప్రమాదంలో ఐచర్ డ్రైవర్ మారుతి నాయుడికి గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద అనంతపురం నుండి కర్నూలుకు పోతున్న లారీని వెనుక నుంచిఐచర్ వాహనం అతివేగంతో ఢీకొంది. గాయాలైన డ్రైవర్‌ను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

కూలీన భారీ వృక్షం

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి వెటర్నరీ హాస్పిటల్ ఆవరణలోని భారీ వృక్షం గురువారం తెల్లవారుజామున కూలింది. వృక్షం విద్యుత్ తీగలపై పడటంతో ఆరు స్తంభాలు విరిగి పోయాయి. అదేవిధంగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ఆ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేసి యుద్ధప్రాతిపదికన విద్యుత్‌పునరుద్ధరణ పనులు చేపట్టారు. పనులను నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి పర్యవేక్షించారు. విద్యుత్ సిబ్బంది రాత్రి ఏడు గంటలకు యథావిధిగా విద్యుత్ సరఫరా చేశారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

డోన్ టౌన్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి నాల్గవ విడత ప్రవేశాలకు శుక్రవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని 20వ తేదీలోపు సమీప ప్రభుత్వ ఐటీఐలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తు చేసుకొన్న ఐటీఐలలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆయన సూచించారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యశిబిరం

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం శాంతిరామ్ హాస్పిటల్ వైద్యుడు బీసన్న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి, వైద్య సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో శేషారెడ్డి సీహెచ్‌సీ వైద్యులు సాగరిక, వెంకటేశ్వర్లు, ఆరోగ్య మిత్ర నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

పేదల ముంగిటకే సంక్షేమ పథకాలు



బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీపీ బుగ్గన

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ పేదల ముంగిటకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యులు మూర్తుజావలీ, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ అన్నారు. గురువారం మండల పరిధిలోని యంబాయి గ్రామంలో సర్పంచ్ యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారు వివరించారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని వారు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, శేఖరయ్య, గూని నాగరాజు, తిరుమలేశ్వర్‌రెడ్డి, దస్తగిరి, మౌలాలీ, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం సంతాప దినాలు



బనగానపల్లె కొండపేట చావిడితో పీర్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: మొహర్రం సంతాప దినాలు గురువారం ముగిశాయి. మొహర్రం వేడుకలు జూలై 29న పీర్ల నిమజ్జనంతో ముగియగా అప్పటి నుంచి 40 రోజుల పాటు షియామతస్తులు సంతాప దినాలుగా భావిస్తారు. సంతాపదినాల కార్యక్రమంలో భాగంగా కొండపేటలోని పీర్లచావిడి నుంచి ఇమాంహసన్, ఇమాంహుస్సేన్ పీర్లతో ఊరేగింపుగా భక్తిగీతాలు అలపిస్తూ షియా మతస్తులు మాతం నిర్వహించి రక్తాన్ని చిందించారు. బ్లేడ్, చురకత్తులతో శరీరాన్ని గాయపరుచుకుంటూ చేపట్టిన మాతం పాత సిండికెట్ బ్యాంకు వరకు సాగింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాతంలో పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు. అలాగే మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఆస్థానం నుంచి బనగానపల్లె నవాబు వంశీయులు మీర్‌ఫజల్ అలీఖాన్ కుమారుడు గులాంఅలీఖాన్‌తో పాటు షియా మతస్తులు మాతం చేసుకుంటూ నవాబు కోట వరకు వెళ్లారు.





సంతాప దినోత్సవం సందర్భంగా బనగానపల్లెలో మాతం నిర్వహిస్తున్న షియామతస్తులు